నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

మంచాల : బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసిన మంచాల పోలీసులు

షాబాద్‌లో బీజేవైఎం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 5 : ఏడాదిలోనే ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని బీజేవైఎం రంగారెడ్డిజల్లా కార్యదర్శి మైలారం విజయ్‌కుమార్ అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌పీఎస్సీ ముట్టడించే కార్యక్రమానికి ముందస్తుగా అరెస్టులు చేయటం సిగ్గుచేటని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్ధరాత్రి నుంచే అక్రమ అరెస్టులు చేసి నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులను అడ్డుకుని అక్రమ అరెస్టులు చేయటం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అక్రమ అరెస్ట్‌లు సిగ్గుచేటు

మంచాల : ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న యువమోక్ష నాయకులను అక్రమంగా అరెస్ట్‌లు చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్యగౌడ్ అన్నారు. ప్రజాసమస్యలపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపేందుకు వెళుతుంటే మంచాల మండల బీజేవైఎం కార్యకర్తలు, నాయకులను శుక్రవారం ఉదయమే అరెస్ట్ చేసి మంచాల పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రాజుగౌడ్, విజయ్, వినోద్, మహేశ్ పాల్గొన్నారు.

షాబాద్ : అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదే మహేశ్ అన్నారు. నిరుద్యోగ ర్యాలీ నేపథ్యంలో శుక్రవారం రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న బీజేవైఎం నాయకులను షాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ...ప్రభుత్వం గ్రూపు-1, గ్రూపు 2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలన్నారు. టీజీపీఎస్సీ పైన ఉన్న సీబీఐ కేసును తక్షణమే పరిష్కరించాలన్నారు. వారి వెంట పార్టీ నాయకులు మహేందర్, రాము తదితరులున్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 5 : జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసి ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ 7నెలలు గడుస్తున్నా ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు చేస్తున్న ఉద్యమానికి మద్దతు తెలపటానికి వెళ్తున్న బీఆర్ఎస్ విద్యార్థి, యువజన నాయకులను అక్రమంగా అరెస్టు చేయటం సిగ్గుమాలిన చర్య అని ఆయన అన్నారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్‌పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అక్రమ అరెస్టులతో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ యాదిలాల్

ఆరె కటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించిన నేతలు

ఆమనగల్లు, జూలై 5: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని శుక్రవారం టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో ఆరె కటికలను ఎస్సీ జాబితాలో చేర్చేలా చొరవతీసుకోవాలని కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారి వెంట నాయకులు రామ్‌కిరణ్, ఆరె కటిక సంఘం నాయకులు ఉన్నారు.

చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ వాయిదా

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌టౌన్, జూలై 5: చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ తాత్కాలికంగా వాయిదా పడింది. స్థానికంగా ఎవరికీ తెలియకుండా, సమాచారం లేకుండా టెండర్లు వేశారని, అందులో స్థానికంగా ఉండే ఆరె కటిక సంఘం, మాంసం విక్రయదారులకు ఎలాంటి సమాచారం లేకుండా ఎలా టెండర్లు వేస్తారంటూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సంఘం నాయకులు, మాంసం విక్రయదారులు ఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండేవారికి ఏ మాత్రం తెయకుండా టెండర్ల ప్రకియకు సంబంధించిన నోటిఫికేషన్ వేశారని, ఈ టెండర్లలో మొత్తం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు సంబంధించి వారు మాత్రమే టెండర్లు వేశారని ఆరోపించారు. మాకు సమాచారం తెలిసి ఉంటే మేము కూడా టెండర్లు వేసే వారిమని తెలిపారు. చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్లపై అవకతవకలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, నాయకులు ఆరె కటిక సంఘం నాయకులు, మాంసం విక్రయదారులు, టెండర్ వేసిన వారితో సమావేశాన్ని నిర్వహించిన అనంతరం చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్‌ను తాత్కాలింగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. మరో 10రోజుల్లో టెండర్ వేస్తామని, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ వేయడం జరిగిందని తెలిపారు.

పకడ్బందీగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చేపట్టాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ భారతరత్నం

షాబాద్, జూలై 5: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మాస్టర్ ట్రైనర్ భారతరత్నం అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో షాబాద్, తాళ్లపల్లి క్లస్టర్‌ల అంగన్‌వాడీ టీచర్లకు కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల యొక్క అభివృద్ధి మైలురాళ్లు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ, తరగతి గది, బాలమేళ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై వివరించిన్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కార్యక్రమాలకు సంబంధించిన పుస్తకాలు అంగన్‌వాడీ టీచర్లకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ

చేవెళ్లటౌన్, జూలై 5: ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, టైపిస్టు రామచందర్ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలకు సంబంధించిన సమస్యలపై ప్రజాపాలన కేంద్రంలో ఫిర్యాదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గౌస్, రాజు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

తుర్కయాంజాల్, జూలై 5 : అగ్నిప్రమాదం లేదా ఏదైనా ప్రకృతి వైపరీత్యంతో అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ఏవిధంగా వ్యవహరించాలో అనే అంశంపై శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకునే విధానాలను మాక్ డ్రిల్ ద్వారా విద్యార్థులకు వివరించారు. సైరన్ మోగిన వెంటనే విద్యార్థులు తమ తరగతులను విడిచిపెట్టి బయటకు వెళ్లాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఎస్సై యాదగిరి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణకు ఆహ్వానం

షాద్‌నగర్ రూరల్, జూలై 5: ఎంపీ డీకే అరుణను సంస్కార భారతి, నవ కళాభారతి సభ్యులు మహబూబ్‌నగర్ పార్టీ ఆఫీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెలలో నిర్వహించనున్న జాతీయ బాలల బహుభాషా నాటికోత్సవానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వానించారు. ఎంపీని కలిసిన వారిలో ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, సింగారం శ్రీనివాస్, రమేశ్‌చారి, శివ ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మండల వ్యవసాయ అధికారి రాగమ్మ

రైతులకు సీడ్ పంపిణీ చేస్తున్న అధికారులు

మొయినాబాద్, జూలై 5: విత్తనాలు వేసేముందు రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ అన్నారు. కృషి వికాస కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని 23 మంది రైతులకు ఫౌండేషన్ సీడ్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని రైతు వేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల మీద దృష్టి పెడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. మార్కెట్‌లో కందులకు మంచి డిమాండ్ ఉంటుందని రైతులు కందులను సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సునీల్, తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మంచాలలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

మంచాల, జూలై 5: మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంచాల మండలం ప్రత్యేకాధికారి సుభాషిని అన్నారు. శుక్రవారం మంచాల గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో అవసరమున్న వారికి పండ్లు, పూలమొక్కలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలశంకర్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి మాజీ జడ్పీటీసీ కృషి

కడ్తాల్ : దశరథ్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

అల్లవాడ మాజీ ఎంపీటీసీని సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్, జూలై 5: మండలం కడ్తాల్ అభివృద్ధికి మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ విశేషంగా కృషి చేశారని పలువురు నాయకులు కొనియాడారు. దశరథ్‌నాయక్ పదవీ కాలం ముగియడంతో శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదేండ్ల కాలంలో దశరథ్‌నాయక్ జడ్పీ నిధులు తీసుకువచ్చి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయక్, మాజీ సర్పంచ్ శంకర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మహేశ్, యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు అంజి, మహేశ్, పాండు, రాజాగౌడ్, రమేశ్, హరి, దాస్య, గోపాల్, వెంకటేశ్, శ్రీనివాస్, ఉపేందర్, శ్రీకాంత్, జాన్యా, దేవ్, సురేశ్, రాజశేఖర్, సాయి, కరుణాకార్, కిరణ్, మురళీ పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : అల్లవాడ మాజీ ఎంపీటీసీ, బీఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత కమ్మరి సత్యనారాయణచారి పదవీకాలం పూర్తి కావడంతో శుక్రవారం చేవెళ్లల్లో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లవాడ, పామెన, జాలగూడ గ్రామాల సమస్యల పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఎంపీటీసీగా నాకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు చెప్పారు.

ఎంపీడీవోకు ఘన సన్మానం

మంచాల : మంచాల మండల అభివృద్ధి అధికారి బాలశంకర్, ఎంపీవో మధుసూదనాచారీలను శుక్రవారం మండల గ్రామపంచాయతీ కారోబార్‌ల సంఘం ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కారోబార్‌ల సంఘం నాయకులు ఎన్ శంకరయ్య, జి.పాండు, డి.భాస్కర్, ఎన్. సురేఖ, ఎన్.అంజయ్య, రవి, జాటోత్ జగన్‌నాయక్, ఎమ్.రంజిత, ఎస్.బాలమణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో బదిలీలు సాధారణం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము

ఆమనగల్లు, జూలై 5: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు సుశీల, అరుణశ్రీ, విద్యావతి, మాలతీలకు పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో శృతిలయ కల్చర్ అకాడమీ అధ్యక్షుడు దార్ల చిత్తరంజన్‌దాస్, పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ తిరుపతిగౌడ్, శ్రీనూనాయక్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

పచ్చదనాన్ని పెంపొందిస్తాం

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య

ఆమనగల్లు, జూలై 5: రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో సాయిబాబా మందిరం సమీపంలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ మాట్లాడుతూ మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని, నాటిన ప్రతి మొక్కను రక్షించాలని, రోడ్డుకు ఇరువైపులా చెట్లను నాటాలని ఆయన పేర్కొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జన్వాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీరబాబు

చేవెళ్ల రూరల్, జూలై 5 : యువత మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలని చేవెళ్ల, మోకిల సీఐలు భూపాల్ శ్రీధర్, వీరబాబు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద, శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ, కొండకల్ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు వ్యవసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, సక్రమమార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలువాలని సూచించారు. గ్రామాల్లో ఏదైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మోకిల ఎస్ఐ కోటేశ్వర్‌రావు, ఏఎస్ఐ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌పై చర్యలు తీసుకుంటాం

పెట్రోల్‌లో నీళ్లు కలిపారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు

పరిశీలించిన పౌర సరఫరాల శాఖ అధికారులు

తుర్కయాంజాల్, జూలై 5 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ పెట్రోల్ బంక్‌లో డీజిల్‌కు బదులుగా నీళ్లు పోశారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నివసించే కృష్ణ ట్రాక్టర్ యజమాని. రోజు మాదిరిగానే ఉదయం మన్నెగూడలోని ఓ పెట్రోల్ బంక్‌లో రూ.3500 డీజీల్‌ను ట్రాక్టర్‌లో కొట్టించాడు. కాగా, పెట్రోల్ బంక్ నుంచి కొద్ది దూరం వెళ్లగానే ట్రాక్టర్ ఆగిపోవడంతో మెకానిక్ వద్దకు వెళ్లి ట్రాక్టర్‌ను రిపేర్ చేయాల్సిందిగా కోరాడు. దీంతో ట్రాక్టర్ రిపేర్ చేసిన మెకానిక్ డీజిల్‌లో నీళ్లు కలిశాయని కృష్ణతో చెప్పగా, అతడు పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని బంక్ సిబ్బంది ఎదుట తన వాహనం నుంచి డీజిల్ తీశాడు. అయితే డీజిల్ మొత్తం నీళ్లుగా రావడంతో బంక్ సిబ్బందిని అడుగుతుండగా, తుర్కయాంజాల్‌కు చెందిన మరో వ్యక్తి రవీందర్ బంక్ వద్దకు వచ్చి తన వాహనంలో సైతం డీజిల్ బదులుగా నీరు ఉందని బంక్ సిబ్బందికి తెలియజేశాడు. వాహనదారుల ఫిర్యాదు మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మనోహర్ కుమార్ రాథోడ్ ఘటనా స్థలానికి చేరుకొని బంక్‌లోని డీజిల్ శాంపిల్ తీసుకొని డెన్సిటీని పరిశీలించి, ల్యాబ్‌లో పరిశీలన పంపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తండ్రిపై కుమారుల దాడి

కుమార్తెలకు ఆస్తిలో వాటా ఇచ్చినందుకే కక్ష

రిమాండ్‌కు నిందితుల తరలింపు

పోలీసుల అదుపులో నిందితులు

కడ్తాల్, జూలై 5: తోడబుట్టిన ఆడపడుచులకు ఆస్తిలో వాటా ఇచ్చినందుకు తండ్రిపై కుమారులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన శుక్రవారం కడ్తాల్ మండలం రావిచేడ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలో రావిచేడ్ గ్రామానికి చెందిన మెండే వెంకటయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వెంకటయ్యకు గ్రామంలో నాలుగు ఎకరాలు వ్యవసాయ పొలం ఉన్నది. ఇటీవల వెంకటయ్య తన నాలుగు ఎకరాల పొలంలో నుంచి, మూడు ఎకరాలను ఇద్దరు కుమారులైన రమేశ్, నర్సింహ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. మిగతా ఎకరం పొలాన్ని వెంకటయ్య తన కూతుర్లు మంగమ్మ, సునీతకు 20 గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో కుమార్తెలకు ఎందుకు పొలం రిజిస్ట్రేషన్ చేశావని ఇద్దరు కుమారులు తండ్రితో గొడవపడ్డారు. ఈ గొడవపై గ్రామంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. తండ్రిపై కక్ష పెంచుకున్న కుమారులు గత నెల జూన్ 20న వెంకటయ్యపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రస్తుతం వెంకటయ్య ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వెంకటయ్య కూతురు మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం నిందితులు రమేశ్, నర్సింహలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు ఆమనగల్లు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

మండల ప్రత్యేకాధికారి నీరజను సన్మానిస్తున్న మండల అధికారులు

నందిగామ ప్రత్యేక అధికారిగా నీరజ

నందిగామ, జూలై 5: నందిగామ మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా హార్టికల్చర్ అధికారి కె.నీరజను జిల్లా ఉన్నతాధికారులు నియమించడంతో మండల ప్రత్యేక అధికారిగా ఆమె బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది ఆమెను సన్మానించారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం

చేవెళ్లటౌన్, జూలై 5: చేవెళ్ల నూతన సీఐగా భూపాల్‌శ్రీధర్, నూతన ఎస్సైగా శ్రీకాంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పామెన గ్రామ మాజీ సర్పంచ్ దావల్ గారి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ విజయ్, నాయకులతో కలిసి చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సైలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగోపాల్, రాములు, వినోద్‌కుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుక్కర్లు పంపిణీ

మంచాల, జూన్ 5: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న 48అంగన్‌వాడీ సెంటర్లకు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5లీటర్ల ప్రెషర్ కుక్కర్లను మాజీ జడ్పీటీసీ మర్రి నిత్య అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం మంచాలలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను జడ్పీటీసీగా 5సంవత్సరాల పదవీ కాలంలో అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధి కోసం తన వంతుగా సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు

షాద్‌నగర్‌టౌన్, జూలై 5: అమావాస్యను పురస్కరించుకుని షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి దేవాలయం ఆవరణలోని శ్రీకృష్ణగోశాలలో శుక్రవారం గోమాతలకు భక్తులు పూజలు చేశారు. అమావాస్య రోజున గోమాతను పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు. అదే విధంగా శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీశైలం, నాయకుడు నందకిషోర్, అర్చకులు కృష్ణ, ప్రమోద్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, జూలై 5: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌ముదిరాజ్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. ఈ మేరకు శుక్రవారం చిన్ననాటి స్నేహితులు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.16వేలు, చేగూరి మహేశ్ రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న మిత్రుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, రాజు, మల్లేశ్, రవి, గోపాల్, సురేశ్, శివ, శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్ల రూరల్, జూలై 5 : చేవెళ్ల మండల పరిధి తండగిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన దాత బండ శ్రీకాంత్ హనుమాన్ ఆలయ నిర్మాణంలో తమవంతు సాయంగా రూ. లక్ష నగదును విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సంద